
# పుణుకుల బుట్టలో లచ్చితల్లి



అమరావతికీ, ధరణికోటకీ మధ్య కృష్ణ ఒడ్డున ఓ పెద్ద చింతచెట్టుంది. రాత్రిళ్ళు ఆ చింతచెట్టు పక్కలకి ఎవరూ వెళ్ళరు. అక్కడ దయ్యాలు తిరుగుతుంటాయని భయం. ఆ చింతచెట్టు వయస్సెవరికీ తెలియదు. కాపు కాయటం ఎప్పుడో మానేసింది. ఉదయంపూట రోజూ కృష్ణకి స్నానానికి వచ్చే అవధాన్లుగారు చేతులు నొప్పులు పుట్టేదాక రాళ్ళు విసరగా విసరగా గుప్పెడు చింతకాయలు రాలేవి. వాటిని భద్రంగా తడికొంగున మూటగట్టుకెళ్ళి వాళ్లావిడకిస్తే ఆవిడ "కృష్ణమ్మ ఇవ్వాళ పచ్చడి కిచ్చిందా?" అంటే అవధాన్లుగారు ఆ మాటల్నే తిరిగేసి "రేపు పప్పు చేసుకోమంది" అనేవాడు.

పదిగంటల ప్రాంతాన ఆ చింతచెట్టు నీడన సంచలనం మొదలవుతుంది. పుట్టలోకొచ్చే చీమల్లా ఒకళ్ళ వెనకాల ఒకళ్ళు అక్కడికి చేరుకుంటారు. రెండుమూడు జట్లుగా విడిపోతారు. ఆ నేలమీదే చతికిలపడి పేకాట మొదలేస్తారు.

కొమ్మల మధ్యనుంచి ఎండపొడ చురుక్కున పొడుస్తున్నా లెక్కచేయకుండా దీక్షగా సాగుతున్న పేకాట యజ్ఞవేదిక దగ్గరకు నిదానంగా నడిచొస్తాడు పుణుకుల

సుబ్బాయి. కుడిచేతిలో వేడి వేడి పుణుకుల బుట్ట ఘుమాయిస్తుండగా ఎడంచేత మాసికలుపడ్డ పాతగుడ్డ నొకదాన్ని ధరించి, ఆ గుడ్డతో ఆ బుట్టమీద అటూ ఇటూ ఆడిస్తూ ప్రత్యక్షమవుతాడు సుబ్బాయి. ఆ పాతగుడ్డ అలా గాల్లో ఆడించటంలో క్రిమి కీటకాదులను పారదోలటమేకాకుండా, పుణుకుల ఘుమ ఘుమని నలుదిక్కులకీ విస్తరింపచేసే ప్రయత్నం కూడా వుంది.

ఆ ఘుమ ఘుమ గాలిలో పరుగెత్తుకొచ్చి ముక్కుకు సోకటంతోటే అక్కడి జనాని కందరికీ వొళ్ళు జలదరించి కడుపులో జఠరాగ్ని ఉవ్వెత్తున లేచేది.

"ఒరే సుబ్బాయ్!"

"ముందిటివ్వరా."

" నా కిచ్చెళ్ళెహె."

"ఇటు రమ్మంటుంటే" ఇలా అన్ని దిక్కుల్నించీ ఆపకుండా వస్తున్న అరుపులు, కేకలు అందుకున్న సుబ్బాయి-

" అయ్యా వచ్చె"

"ఇదుగో ఇక్కడే"

"ముందు మీకే"

"ఇదుగో ఆకు"

అంటూ ఎక్కడ కక్కడ సమాధానాలు చెపుతూ, మెరుపులా తిరుగుతూ, వర్షధారల మధ్య గుర్రాన్ని నడిపే చాకచక్యంతో క్షణాలమీద అందరికీ పుణుకులు అందించేవాడు. కాని పచ్చడికి మహ లోభించేవాడు. "మరికాస్త పచ్చడెయ్యరా?" అని ఎవరైనా అంటే ""ఏటిబాబూ! పుణుకులు తింటే బలంగాని పచ్చడి తింటే ఏవస్తది" అని విసుక్కుంటూ కాస్త విదిలించేవాడు. ఎంతవేగంతో పుణుకు లిచ్చేవాడో అంతవేగంతో డబ్బులు వసూలుచేసేవాడు. పేక కలపనిచ్చేవాడు కాదు. ముక్క వెయ్యనిచ్చేవాడు కాదు."ఆటలో పడి మర్చి పోతారు బాబూ" అంటూ వెకిలి నవ్వుతో వినయంగా గొంతుమీద కూర్చునేవాడు.

ఇంతలో రేవులోకి అవతలి వొడ్డునుంచి పడవొచ్చేది. రయ్యిన బాణం లాగా రేవులో కెళ్ళిపోయేవాడు సుబ్బాయి. "పుణుకులు! వేడి పుణుకులు" అంటూ దిగినవాళ్ళని చుట్టుముట్టేవాడు. సామాను సొంతం దింపుకోకుండానే పుణుకులు కొనిపించేవాడు. ఎవరైనా కొనని వాళ్ళుంటే వాళ్ళపిల్లల చుట్టూతా బుట్ట చూపిస్తూ ప్రదక్షిణాలు చేసేవాడు. పిల్లల తాకిడికి తట్టుకోలేక చచ్చినట్టు కొనేవాళ్ళు. రేవుకీ, చింతచెట్టుకీ మూడుసార్లు తిరిగేటప్పటికి బుట్ట సగం పైగా ఖాళీ అయ్యేది.

బేరం కొంచెం మందకొడిగా ఉన్నప్పుడు పేకాట ఆడుతున్నవాళ్ళ వెనక చేరి "పోలయ్యగారూ! ముక్క తియ్యండి ఈ దెబ్బతో ఆటయిపోవాల" అనేవాడు. ఆ ముక్కతో ఆటయిపోయిందనుకోండి-పోలయ్య అడక్కుండానే ఆకులో పుణుకులు పెట్టి ఇచ్చి డబ్బులు వసూలు చేసేవాడు. ఆట పోయి కూర్చున్న వాళ్ళ దగ్గరకెళ్ళి వద్దురా అంటున్నా "పచ్చడి ఎక్కువేశాను తీసుకోండి. మళ్ళీ ఆటేసేదాకా ఖాళీయేగా" అంటూ అంటగట్టేవాడు.

సాయంత్రం మూడుగంటలవేళ బుట్ట ఖాళీ అయినా సుబ్బాయి అక్కణ్ణించి కదిలేవాడు కాదు. అసలు బేరం ఆ తర్వాతే. పేకాట కురుక్షేత్రంలో కాళ్ళూ చేతులూ విరిగి, తలపగిలి అడ్డం పడిపోయిన జనం సుబ్బాయి వైపు దీనంగా చూసి "ఓ రెండు రూపాయలప్పివ్వరా?" అని ఎవరైనా అంటే "నా దగ్గ రేముంటుంది బాబూ! పుణుకులమ్ముకునే వాణ్ణి" అనేవాడు సుబ్బాయి. ఎవరడిగినా ముందు ఆ వాక్యం తప్పకుండా అనగా ఆ తర్వాత సంభాషణ దాదాపు ఇలా సాగేది.

"అమ్మకంలోదివ్వరా?"

"అమ్మో? ఇదిస్తే బియ్యానికి లేవు బాబూ."

"సాయంత్రానికిస్తాలేరా?"

"ఇప్పుడు మీకిస్తే రేపు మళ్ళీ సరుకేసుకు రావాలా? ధరలు మండి పోతున్నాయి."

"నీ పావలా వడ్డీ వేసుకోరా"

"వడ్డీ, అసలు, మీదగ్గర ఎక్కడకెళ్తుంది బాబూ, నా ఇబ్బందే ....." అంటూ బతిమాలించుకుని, బతిమాలించుకుని అప్పులిచ్చేవాడు. పుణుకులమ్మితే ఐదురూపాయలు లాభం వస్తే రూపాయికి పావలా వడ్డీల మీద పది మిగిలేది. సాయంత్రానికి వసూళ్ళు పూర్తి చేసుకుని చీకటి పడ్డాక సారాకొట్టు దగ్గర కొచ్చేవాడు. సారా కన్నె ఓ ముద్దిచ్చి వెళ్ళిపోతే జిల్ అయిపోయి, ఆ సారా కన్నెని సొంతం కౌగిలించుకుందుకు డబ్బుల్లేక గిలగిల్లాడే సారా సరసులకి అర్ధరూపాయి వడ్డీలమీద అప్పు లిచ్చేవాడు సుబ్బాయి. వసూళ్ళు కొంత పంటల్లో సాధించేవాడు.

మూడేళ్ళలో చిల్లరకొట్టు పెట్టాడు సుబ్బాయి. నగలు తాకట్టు పెట్టి అప్పులు తీసుకెళ్లినవాళ్ళు సగం మంది అప్పులు తీర్చలేక నగలు వొదిలేస్తుకునేవారు. అప్పుల కింద కొందరి పొలాలు జప్తయిపోగా పుణుకుల సుబ్బాయి ఇప్పుడు నలభై ఎకరాలకి, మూడు భవంతులకి అధిపతి. లక్షలమీద వడ్డీ వ్యాపారం.

ఇప్పుడతన్ని ఎవరూ సుబ్బాయి అనరు. వాళ్ళ కులంవాళ్ళు సుబ్బయ్య అంటే మిగతావారు సుబ్బారావుగారు అంటారు. మనవలు, మనవరాళ్ళతో ఘనంగా బతుకుతున్న సుబ్బాయి ఎవర్నీ నమ్మడు. తెల్లవారుజామునే లేచి తలుపు వేసుకొని రహస్యంగా ఓ గంటసేపు ప్రార్థన చేస్తాడు. 'నా ప్రార్థనే నా లక్ష్మి' అంటాడు అందరితో.

పట్నం కాలేజీలో చదువుకుంటున్న సుబ్బాయి మనవడు, తండ్రి తాతలు పెట్టిన బుచ్చయ్య అనే పేరును హేమంతకుమార్‌గా మార్చుకుని సెలవలకి ఇంటి కొచ్చాడు. తాతగారి ప్రార్థన రహస్యం, లక్ష్మి కీలకం కనుక్కుందామని కాపేసి ఓ రోజు తలుపు సందుల్లోంచి బైనాక్యులర్స్ పెట్టి చూశాడు. లక్ష్మి రహస్యం తెలిసిపోయింది.

సుబ్బారావుగారు అలనాడు పుణుకుల బుట్టమీద ఆడించిన మాసికల పాత గుడ్డల్ని పూజిస్తున్నారు.*